సాక్షి
నారాయణపేట
సోమవారం। 27। ఫిబ్రవరి। 2023


ఆదరణేదీ..?
వనపర్తి హాకీ అకాడమీ అధికారుల నిర్లక్ష్యపు నీడలో మగ్గుతోంది.
వివరాలు 8లో ▸


వచ్చేది బహుజన రాజ్యమే..
రాష్ట్రంలో వచ్చేది బహుజన రాజ్యమే అని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.3 /19.3
వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రికి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా సైనిక్ పాఠశాల పరీక్ష

నారాయణపేట రూరల్: సైనిక్ పాఠశాలలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. 6వ తరగతిలో ప్రవేశానికి 66మందికి గాను 52మంది ఉపస్థితి కాగా 14మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి 93మందికి గాను 85మంది హాజరై 8మంది అనుపస్థితి అయ్యారు. పరీక్షను సీఎస్ దేవసేనా, డిపార్ట్‌మెంటల్ అధికారి రమేష్ పర్యవేక్షించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణపేట రూరల్: జిల్లా ప్రజలకు ఆర్టీసీ అందిస్తున్న రవాణా సేవలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సెల్ నంబర్ 73828 26293 నెంబర్‌కు కాల్ చేసి, ప్రయాణికులు తమ ఫిర్యాదులు, సలహాలను తెలియచేయాలన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



ఊట్కూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని బిజ్వార్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇప్పటివరకు ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ఇప్పటికీ అందించలేదని ఆరోపించారు. పతి వ్యక్తికి 10కిలోల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం అందిస్తుందని తెలిపారు. రూ.280కే రైతులకు యూరియా బస్తా రైతులకు అందించిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదని తెలిపారు. ప్రతి కార్యకర్త పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు అశోక్, ఆంజనేయులు, కుర్వ ఆశప్ప, గోపాల్ పాల్గొన్నారు.

యాసంగి జోరు..

జిల్లాలో 1,50,835 ఎకరాల్లో పంటల సాగు

- వరి 1,22,994 ఎకరాల్లో..
- సర్వే పూర్తిచేసిన వ్యవసాయ శాఖ


నర్వ మండలం సిపూర్ శివారులో పంట వివరాలు సేకరిస్తున్న ఏఈఓ, క్రాస్‌చెక్ చేస్తున్న డీఏఓ

జిల్లా వ్యాప్తంగా యాసంగి పంటల సాగు వివరాలు

	యాసంగి2020-21		యాసంగి 2021-22		యాసంగి 2022-23	
పంటలు	రైతులు	ఎకరాలు	రైతులు	ఎకరాలు	రైతులు	ఎకరాలు
వరి	48,697	1,01,626	52,453	93,552	67,322	1,22,944
జొన్న	1236	3057	992	2,620	923	2,094
చెరకు	56	178	428	1,240	346	987
వేరుశనగ	5166	8,343	8630	16,032	6868	10,041
శనగ	91	270	163	381	109	345
కూరగాయలు	5,261	2057	4074	1,921	2266	1607
ఇతరపంటలు	1,116	1,629	2,903	4,486	4841	12,817
మొత్తం	61,623	1,17,160	69,643	1,20,232	82,675	1,50,835

నారాయణపేట: జిల్లావ్యాప్తంగా ఈసారి యాసంగి సాగు మరింత పెరిగింది. నీటి వసతి పెరిగిన నేపథ్యంలో మరిన్ని ఎకరాలు సాగులోకి వచ్చాయి. వ్యవసాయశాఖ యంత్రాంగం పంటల సమగ్ర వివరాలు సేకరించేందుకు ప్రత్యేక సర్వే చేపట్టారు. దీంతో 1,50,835 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయని తేల్చారు. 77 క్లస్టర్లలో ఏఈఓలు పంటలను పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఏఓలు, ఏడీలతో పాటు జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్‌సుధాకర్ పర్యవేక్షించారు.

పోర్టల్‌లో పంటల వివరాలు..

జిల్లాలోని 13 మండలాలు 77 క్లస్టర్‌లలోని 253 రెవెన్యూ గ్రామాల్లో గల రైతులు యాసంగిలో వేసిన పంటల నమోదు ప్రక్రియ ముగిసింది. రైతులు తమ పొలాల్లో ఏ పంటను సాగు చేశారు, ఎంత విస్తీర్ణంలో ఏ రకం పంటను విత్తారనే వివరాలను వ్యవసాయశాఖ సిబ్బంది సేకరించారు. ఆన్‌లైన్‌లో వ్యవసాయ భూముల సర్వే నంబర్లు, పంటల వివరాలు, పాసుపుస్తకం నంబర్, ఆధార్ నంబర్, బ్యాంకు పాసుపుస్తకం నంబర్ తదితర వివరాలను రైతుల వారీగా ఆన్‌లైన్ డాటాను పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు.

వరిసాగు ఇలా..

జిల్లాలో 2020-21 యాసంగిలో రైతులు 48,697 మంది 1,01,626 వరి సాగు చేశారు. 2021-22లో 52,453మంది రైతులు 93,552 ఎకరాల్లో వేశారు. బోరుబావులు, రిజర్వాయర్‌లు, చెరువుల కింద వరి ధాన్యం వైపే మొగ్గుచూపారు. ఈఏడాది యాసంగిలో 67,322 మంది రైతులు 1,22,944 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఏటేటా వానాకాలంతో పాటు యాసంగిలో సైతం వరిసాగుపై రైతులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 29,392 ఎకరాల్లో అధికంగా వేసినట్లు అధికారుల లెక్కల్లో తేలింది.

క్రాస్ చెక్..

జిల్లాలోని ఏఓలు, ఏడీఏలు ప్రతివారం రోజుల వ్యవధిలో 40 సర్వే నంబర్లలో రైతులు వేసిన పంటలను క్రాస్ చెకింగ్ చేస్తూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. క్షేత్రస్థాయిలో వెళ్లి ఏఈఓలు అప్‌లోడ్ చేస్తున్నారో లేదోనని వాటిని జిల్లా వ్యవసాయ అధికారి పర్యవేక్షిస్తూ 20 సర్వే నంబర్లలో పంటలను పరిశీలించి ఆన్‌లైన్‌లో క్రాస్‌చెక్ చేస్తూ లెక్కలను తేల్చి ఎక్కడా తప్పిదాలు లేకుండా చూడగలిగారు.

ప్రత్యామ్నాయ పంటలు..

2021 యాసంగిలో 15,534 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేయగా 2022 యాసంగిలో 26,680 ఎకరాల్లో సాగు చేశారు. 2021లో వేరుశనగా 8,343 ఎకరాల్లో సాగు చేయగా, 2022లో 16,032 ఎకరాలు చేశారు. 2023లో 6868 మంది రైతులు 10,040 ఎకరాలు, 2021లో కూరగాయలు 2057 ఎకరాలు, 2022లో 1,921 ఎకరాలు, 2023లో 2266 మంది 1607 ఎకరాల్లో చేశారు. జిల్లాలో మూడేళ్ల నుంచి పంటలు వివరాలు ఇలా ఉన్నాయి. 2021లో వివిధ పంటలు 1,17,160 ఎకరాల్లో సాగు చేయగా, 2022లో 1,20,232 ఎకరాల్లో సాగు చేయగా, 2022-23లో 1,50,835 ఎకరాల్లో చేశారు.

వందశాతం పూర్తి..

పంటలపై సర్వేను పకడ్బందిగా చేపట్టాము. ఈ ఏడాది యాసంగిలో రైతులు వేసిన పంటలను క్షేత్రస్థాయిలో పొలాల వద్దకు వెళ్లి ఏఈఓలు ఆన్‌లైన్‌లో ధరణిలోని రైతబంధు పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. సర్వే పూర్తి కావడంతో 1,50,835 ఎకరాల్లో పంటలు వేసినట్లు తేలింది.


– జాన్‌సుధాకర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

క్రీడలతో అనారోగ్య సమస్యలు దూరం


మాట్లాడుతున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: నిత్యం ఆటలు ఆడటం వల్ల శారీరక, మానసిక సమస్యలు దూరమై ఆరోగ్యంగా ఉంటామని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆవరణలో ఆదివారం బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలు మనలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను బయటకు తీస్తాయని, పోరాట పటిమను పెంపొందిస్తాయని చెప్పారు. పోటీలలో గెలుపు, ఓటములు సహజమని, నిరాశ పడకుండా మరింత కష్టపడి రాణించాలన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో 28 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ సత్యనారాయణ, నవీన్, తులసి, డాక్టర్ క్రాంతికుమార్, రమేష్, శ్రీనివాసులు, గోపీ, శంకర్‌లాల్, సాయినాథ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుదాం


మాట్లాడుతున్న జయలక్ష్మి

నారాయణపేట టౌన్: ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు శారద అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి హాజరై మాట్లాడారు. మార్చి 8న మహిళా అంతర్జాతీయ ఆవిర్భావం జరిగి 112 సంవత్సరాలు పూర్తయిందన్నారు. మహిళలు తమ హక్కుల కోసం పోరాడి సాధించుకున్న రోజుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న జరుపుకుంటామని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో సగభాగమైన మహిళలపై బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక దాడులు, హత్యలు, అత్యాచారాలు బీజేపీ పాలిత రాష్ట్రాలలో రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. 2021 కంటే 2022 సంవత్సరంలో మహిళలపై దాడులు 30 శాతం అధికమయ్యాయన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి సౌజన్య, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, సహాయ కార్యదర్శి భాగ్యలక్ష్మి, కోశాధికారి మహాదేవి, జిల్లా సభ్యులు చంద్రకళ, లక్ష్మి, సునీత, రాధిక అనిత, మాధవి, మంజుల, రాధమ్మ, అరుణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు, సంక్షేమ పథకాల అమలుకు ఉద్యమిద్దాం


జెండాను ఆవిష్కరిస్తున్న ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు కాశప్ప

నారాయణపేట టౌన్: చట్టాలు, సంక్షేమ పథకాల అమలు కోసం ఐక్యతతో ఉద్యమిద్దామని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు కాశప్ప అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యాలయంలో ఎన్‌పీఆర్‌డీ ఆవిర్భావ దినత్సోవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అ సంఘం జిల్లా కోశాధికారి గజలప్ప ఎన్‌పీఆర్‌డీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు కాశప్ప మాట్లాడుతూ 2010 ఫిబ్రవరి 20, 21 తేదీల్లో ఆత్మగౌరవం, హక్కుల సాధన లక్ష్యాలతో సంఘం ఏర్పడిందన్నారు. 13 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. ఈనెల అన్ని జిల్లా వ్యాప్తంగా 27న అన్ని మండ కేంద్రంలో జెండా ఆవిష్కరణలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సెమినార్స్, రక్తదాన శిబిరాలు, పండ్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈనెల 28న హైదరాబాద్‌లో ముగింపు సందర్భంగా విద్య, ఉపాధిపై సెమినార్ నిర్వహిస్తున్నామని అన్నారు. 13 ఏళ్లలో దేశవ్యాప్తంగా విస్తరించిన వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు చేసి విజయాలు సాధించిందని అన్నారు. 2016లో ఆర్‌పీడీ చట్టం, యూనివర్సల్ గుర్తింపు కార్డులు ఉపాధి హామీ పథకంలో 150 రోజులు, అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు కోసం పోరాడి సాధించుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెన్షన్ పెంపు కోసం ఉద్యమాలు చేసి సాధించామని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి రాధమ్మ, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి బాల్‌రాజు, మండలాధ్యక్షుడు ఖతాల్, కార్యదర్శి హన్మంతురెడ్డి, మాగనూరు మండల అధ్యక్షుడు బాబు, కార్యదర్శి రవి, కృష్ణ, ధన్వాడ మండల కార్యదర్శి పెంటయ్య, దామరగిద్ద మండల కార్యదర్శి వెంకటేష్, సీఐటీయూ జిలా కన్వీనర్ బాల్‌రాం పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి జయంత్యుత్సవాలు


స్వామివారి రథోత్సవం

నారాయణపేట రూరల్: పట్టణంలోని పరిమళాపురం రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి 428వ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి నిర్మాల్యం, పంచామృతాభిషేకం, అర్చన, అలంకరణ, హారతి తదితర పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో పల్లకిసేవా, మహారథోత్సవం నిర్వహించి భజన కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే దంపతుల సౌజన్యంతో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మేఘ, బీఆర్ఎస్ నాయకులు గందె చంద్రకాంత్, శ్రీపాద్, కన్నజగదీష్, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం..

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా చలివేంద్రాన్ని ఆదివారం శ్రీరాఘవేంద్ర స్వామి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో డీఈఈ లియాకత్‌అలీ, లయన్ గవర్నర్ హరినారాయణ్‌బట్టడ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. దాతలు రవికుమార్‌గౌడ్, వినోద్ సౌజన్యంతో ప్రతిరోజు తాగునీరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు ఉండటంతో పెద్దఎత్తున విద్యార్థులు, మహిళలు వస్తుంటారని, వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు.


చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో పండ్ల పంపిణీ..

శ్రీరాఘవేంద్రస్వామి జయంతి సందర్భంగా సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో పాతబస్టాండ్ వద్ద గల చిన్నపిల్లల ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వెంటనే వారి జబ్బులు నయం అయ్యేలా స్వామివాకి ఆశీర్వాదం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ సభ్యులు మొల్గాన్ జనార్దన్, సాయినాథ్, రవిగౌడ్, శ్రీనివాస్, భీంచందర్, ఆత్మారాం, గందె ఉమాకాంత్, కృష్ణమూర్తి, సదానంద్, శివరాజ్‌అడ్వకేట్, సంజీవ్ ప్రకాష్, ఎస్పీ బాలు ఫ్యాన్స్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఫిజియోథెరపి పోస్టుకు ఇంటర్వ్యూ

నారాయణపేట రూరల్: జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఫిజియోథెరపి పోస్టుకు సోమవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌కు అర్హులైన అభ్యర్థులు రావాలని సూ చించారు. కాంట్రాక్టు పద్ధతిలో పని చేయాల్సి ఉంటుందని, వేతనం రూ.26వేలు ఉంటుందని పేర్కొన్నారు.

వసూళ్ల పర్వం..!

విద్యుత్‌శాఖలో సిబ్బంది చేతివాటం

- చిన్న చిన్న పనులకు సైతం డబ్బుల డిమాండ్
- ప్రతిదానికి ఇంత రేటు అని వసూలు
- ఇవ్వడానికి నిరాకరిస్తే కొర్రీలు పెట్టి వేధింపులు
- పట్టించుకోని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు

గండేడ్/ కోస్గి: ఒకవైపు విద్యుత్ కోతలతో సతమతమవుతున్న రైతులు, వినియోగదారులు.. మరోవైపు సిబ్బంది చేతివాటంతోనూ తంటాలు పడక తప్పడం లేదు. చేయి తడిపితేగాని పని ముందుకుసాగని పరిస్థితి దాపురించింది. కాదు.. కూడదు అంటే కొర్రీలు పెట్టి వేధిస్తారు. దీంతో చేసేది లేక ఇచ్చుకోక తప్పడం లేదు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల పరిధిలో ఈ తంతు కొనసాగుతుంది. విషయం తెలిసినా.. సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. మహమ్మదాబాద్ మండలంలో నంచర్ల, వెంకటరెడ్డిపల్లి, మహమ్మదాబాద్, గండేడ్ మండల పరిధిలోని వెన్నాచేడ్, సల్కర్‌పేట్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 12 వేల వరకు డొమెస్టిక్.. 8 వేల వరకు వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. 2,200 ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ సరఫరా నిమిత్తం ఏర్పాటు చేశారు. ఉమ్మడి మండలాల పరిధిలోని పగిడ్యాల్, బల్సూర్‌గొండ, గండేడ్, కొంరెడ్డిపల్లి, జిన్నారం, చెలిమిళ్ల, చిన్నవార్వాల్, రుసుంపల్లి, మహమ్మదాబాద్, నంచర్ల, మొకర్లాబాద్, వెంకట్‌రెడ్డిపల్లి, కంచన్‌పల్లి తదితర గ్రామాల్లో సమస్యలు తలెత్తినప్పుడు సిబ్బంది సకాలంలో మరమ్మతు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక డబ్బులు ఇస్తేగాని ఏ పని చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. సిబ్బంది పనిచేయకుండా ప్రైవేట్ వ్యక్తులతో చేయించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. స్తంభాలు మారిస్తే రూ.4-5 వేల వరకు తీసుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. ఏ చిన్న పనైనా డబ్బులు ఇవ్వనిదే చేయడం లేదని వాపోతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు..

వ్యవసాయ పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు అధిక లోడ్‌తో తరుచుగా కాలిపోతుంటాయి. వీటికి మరమ్మతు చేయాలంటే నారాయణపేట జిల్లా కోస్గికి తీసుకెళ్లాల్సి వస్తోందని.. అక్కడ సిబ్బంది ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఒకవేళ ఇవ్వకపోతే మరమ్మతులో జాప్యం చేస్తున్నారని వాపోతున్నారు. ఒక్కోసారి వారం రోజులకుపైగా పడుతుందని, దీంతో పంటలు ఎండిన సందర్భాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. రెండు మండలాల నుంచి కోస్గికి వెళ్లాలంటే 15 నుంచి 25 కి.మీ., దూరం అవుతుందని.. ఇందుకుగాను ట్రాక్టర్ అద్దె, ఖర్చులు రూ.3 వేల వరకు అవుతున్నాయని.. రవాణా చార్జీలు సైతం తామే భరించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కోస్గిలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం

టీనోట్, రిజిస్ట్రేషన్‌కు..

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే టీనోట్ తీసుకెళ్లి మరమ్మతు కేంద్రంలో ఇవ్వాల్సి ఉంటుంది. రెండు మండలాలకు కలిపి నంచర్లగేట్‌లో ఒక సిబ్బందికి అప్పగించారు. అతను రాసిస్తే ఏఈ సంతకం చేస్తారు. ఇందుకుగాను రూ.200 వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. టీనోట్‌కు వెళ్తే తన వద్ద కూడా రూ.200 తీసుకున్నారని గండేడ్ మండలంలోని ఓ గ్రామ సర్పంచ్ తెలిపారు. దీంతోపాటు రిజిస్ట్రేషన్‌కు కూడా సంబంధిత సిబ్బంది రూ.200 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. అదనపు మీటర్లు, కొత్త కనెక్షన్లకు సంబంధించిన ధ్రువపత్రాలను కోస్గి ఏడీ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాలి. తద్వారా వినియోగదారులకు కావాల్సిన వాటిని సమకూరుస్తారు. ఇక్కడ కూడా పైకం లేనిదే ఏ పని జరగడం లేదు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు	టీనోట్, రిజిస్ట్రేషన్‌కు	డీడీల పేరిట
రూ.1,000 నుంచి రూ.1,500	రూ.200 నుంచి రూ.500	రూ.1,000 నుంచి రూ.1,500
రాకపోకలకు అదనపు భారం		

గ్రామస్థాయి నుంచి..

గ్రామస్థాయిలో ఉండే సిబ్బంది మొదలు మండలస్థాయి వరకు విద్యుత్‌శాఖలో వసూళ్ల పర్వం కొనసాగుతోంది. సర్వీస్‌వైరు వేయాలన్నా.. ఫ్యూజ్ పోయినా.. ఎల్‌సీ ఇవ్వాలన్నా.. జంపర్లు వేయాలన్నా చేయి తడపాల్సిందే. బకాయిలు కట్టిన తర్వాత తిరిగి కనెక్షన్ పునరుద్ధరించడానికి కూడా డబ్బులు ఇవ్వాల్సిందే. కాంట్రాక్టు లేబర్ మొదలుకొని లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఇలా ప్రతిఒక్కరూ తమతమ స్థాయిలో చేయి చాస్తున్నారు. ఇవ్వకపోతే కొర్రీలు పెట్టి పనులు సకాలంలో చేయడం లేదు. ఒక్కోసారి రాత్రిళ్లు ఉండేలా కూడా చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నాలుగుసార్లు డబ్బులిచ్చా..



ఈ నెలలో నాలుగుసార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. వెళ్లిన ప్రతిసారి డబ్బులిచ్చాను. ఇప్పటి వరకు రూ.4 వేలు మరమ్మతు చేసేవారికి ఇచ్చాను. డబ్బులు ఇచ్చినా కూడా ఓసారి ఎనిమిది రోజుల సమయం పట్టింది. సొంత ట్రాక్టర్ ఉన్నా డీజిల్, తిండికి రూ.వెయ్యి వరకు ఖర్చవుతోంది. దీంతో సమయం వృథాతోపాటు ఆర్థికంగా నష్టపోతున్నాం. సిబ్బంది కూడా పిలిస్తే సకాలంలో రావడం లేదు. – కర్నె రాములు, రైతు, వెన్నాచేడ్

రవాణా చార్జీలు ఇవ్వడం లేదు



ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే వాహనంలో తీసుకెళ్లి మరమ్మతులు చేయించి రైతుల పొలం దగ్గరకు వాహనంలో ట్రాన్స్‌ఫార్మర్ దించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖదే అనే విషయం తెలియకపోవడంతో రవాణా చార్జీలు రైతులమే భరిస్తున్నాం. మా పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నెల రోజుల వ్యవధిలో రెండుసార్లు కాలిపోవడంతో సొంత ఖర్చులతో మరమ్మతు కేంద్రానికి తీసుకెళ్లాను. రవాణాచార్జీలు మీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని బ్యాంకు బుక్కు జిరాక్స్ తీసుకున్నారు. ఇప్పటివరకు రవాణా చార్జీలు చెల్లించలేదు.

– రాజు, రైతు, కోస్గి

డబ్బులివ్వొద్దు..

సిబ్బందికి ఎవరూ డబ్బులు ఇవాల్సిన అవసరం లేదు. ఎవరైనా డిమాండ్ చేస్తే మా దృష్టికి తీసుకురండి. సిబ్బంది డబ్బులు వసూలు చేసినా.. పనుల్లో జాప్యం చేసి వినియోగదారులు, రైతులను ఇబ్బందిపెట్టినా సహించం. మద్దూరు, కోస్గి, గండేడ్ మండలాలకు కలిపి కోస్గిలోనే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం ఉంది. మూడు మండలాలకు కలిపి ఒకే వాహనం ఉంది. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని అధిగమించేందుకుగాను ఏప్రిల్ నుంచి నేరుగా రైతుల ఖాతాలోనే రవాణా చార్జీలు వేసేలా ప్రణాళిక రూపొందించాం.

– సంజీవరెడ్డి, డీఈ, నారాయణపేట

క్లుప్తంగా

వ్యవసాయ బావిలో పడి యువకుడి మృతి

కేటీదొడ్డి: వ్యవసాయ బావిలో మోటార్ పంపు తీయడానికి వెళ్లి నీటిలో మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఉమిత్యాలలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని బావిలో మునిగిన మోటారు పంపు తీయడానికి వెళ్లిన ప్రకాష్ (22) నీటిలో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో ఆందోళన చెందిన గ్రామస్తులు బావిలో మోటారు పెట్టి నీటిని బయటకు తోడి మృతదేహాన్ని తీశారు. తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బురదగుంతలో చిక్కుకుని బాలుడు..

గద్వాల క్రైం: బురదగుంతలో పడి బాలుడు మృతిచెందిన సంఘట న మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇటిక్యాల మండలానికి చెందిన బోయ బజారమ్మ రెండవ కుమారుడు శేషన్న (16) రెండేళ్ల క్రితం సంగాలకు చెందిన కుర్వ నర్సింహులు వద్ద గొర్రెల కాపరిగా పనికి చేరాడు. ఆదివారం ఉదయం మూగజీవాలను తీసుకుని గ్రామ శివారులోని సంగాల చెరువు వెనుక భాగంలో వెళ్లాడు. కొన్ని మూగజీవాలు నీళ్లు తాగేదుంకు చెరువు సమీపంలోని గుంతలోకి వెళ్లి బురదలో చిక్కుకున్నాయి. వాటిని తప్పించే క్రమంలో బురద గుంతల్లో శేషన్న పడి మృతి చెందాడు. గమనించిన స్థానిక రైతులు కాపాడే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. సంఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

ఆటోలో నుంచి జారిపడి వృద్ధుడు..

ఉప్పునుంతల: మండలంలోని కొరటికల్‌లో ఆదివారం మధ్యాహ్నం ఆటోలో నుంచి జారిపడి సంపెంగ పెద్దరాములు (63) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ఉదయం గ్రామం నుంచి ఆటోలో ఆసరా పింఛన్ డబ్బులు తీసుకునేందుకు మరికొంతమందితో కలిసి పొరుగున ఉన్న వెల్టూర్‌లోని బీపీఎం వద్దకు వెళ్లారు. తిరిగి ఆటోలో వెనుక కూర్చొని వస్తుండగా కొరటికల్ సమీపంలోని మూలమలుపు జారిపడి అక్కడిక్కడే చనిపోయాడు. మృతుని భార్య కొన్నేళ్ల క్రితమే అనారోగ్యంతో చనిపోగా ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


ఆంజనేయులు (ఫైల్)

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలం చేగుంట చెందిన ఆంజనేయులు, రాములు ద్విచక్ర వాహనంపై మంగనూర్‌లోని జాతర నుంచి తిరిగి వెళ్తుండా రోడ్డు ప్రమాదానికి గురై ఆంజనేయులు (42) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. బిజినేపల్లి ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆంజనేయులు, రాములు శనివారం సాయంత్రం మంగనూర్ జాతర నుంచి చేగుంటకు తిరుగు ప్రయాణమయ్యారు. ప్రమాదశావత్తు రోడ్డు ప్రమాదానికి గురై ఆంజనేయులు, రాములును ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, ఆంజనేయులు అదే రోజు రాత్రి మృతి చెందాడు. భార్య నాగేంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం: కుటుంబ సమస్యలు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని వడ్లవీధికి చెందిన పల్లవి భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. ఒక కుమారుడు ఉన్నాడు. కొన్ని రోజులుగా ఇంటి పక్కన కుటుంబ సమస్యలతో భూ వివాదం నెలకొనడంతో తీవ్ర కలత చెందిన మహిళ ఉదయం పట్టణంలోని గంజిపేట వద్ద జూరాల కుడి కాల్వలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను రక్షించారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ఆదరణేదీ?


బాలుర జూనియర్ కళాశాల మైదానంలో అకాడమీ విద్యార్థుల ప్రాక్టీస్

- నిర్లక్ష్యం నీడలో వనపర్తి హాకీ అకాడమీ
- మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం
- ప్రహరీ లేక పందులు, కుక్కల సంచారం


వనపర్తిలోని హాకీ అకాడమీ

వనపర్తి క్రైం: వనపర్తి హాకీ అకాడమీ నిర్లక్ష్యపు నీడలో కొనసాగుతుంది. నిర్వహణలో ఇటు పాలకులు.. అటు అధికారులు పట్టనట్లు వ్యవహరించడంతో సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదు. హాకీ అకాడమీ క్రీడాకారులకు మౌలిక వసతుల కల్పన కలగానే మిగిలిపోయింది. భోజన వసతి కల్పించడంలోనూ ఏజెన్సీ లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. హాకీ అకాడమీకి సొంత భవనం కొరవడింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదుల్లోనే దీన్ని నెట్టుకొస్తున్నారు. ఇది జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీ గదికి సమీపంలో ఉంది. అక్కడ వేసే వ్యర్థపదార్థాలు, మార్చురీ గది నుంచి వచ్చే దుర్వాసనతో క్రీడాకారుల సాధన ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు రెగ్యులర్ జిల్లా క్రీడాధికారి లేకపోవడంతో నిర్వహణలో సమస్యలు మరింతగా పెరిగిపోతున్నాయి. ఏటా ఇక్కడి క్రీడాకారులకు హాకీ కిట్లను పంపిణీ చేయకపోవడంతో క్రీడాకారులు ఉన్నతంగా రాణించలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. హాకీ క్రీడా నైపుణ్యానికి అవసరమైన ప్రత్యేక టర్ఫ్ మైదానం ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించలేకపోతున్నారు.

అకాడమీ ఏర్పాటు ఇలా..

జిల్లాల ఏర్పాటు అనంతరం 2018 జూన్ 22న వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలోని గదుల్లో హాకీ అకాడమీని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 24 మంది క్రీడాకారులకు గాను.. ప్రస్తుతం 22 మంది ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. వీరికి రోజూ ఇద్దరు కోచ్‌లు శిక్షణ అందిస్తున్నారు. 16 ఏళ్ల లోపు విద్యార్థులను వారి క్రీడా ప్రతిభ ఆధారంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. అయితే వీరికి కనీస మౌలిక వసతుల కల్పనపై తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక టర్ఫ్ మైదానం లేక...

వనపర్తిలో హాకీ అకాడమీ ఏర్పాటు చేసినప్పటికీ క్రీడాకారుల సాధన మైదానంలోనే చేయాల్సి వస్తోంది. దీంతో క్రీడాకారులకు రాష్ట్రస్థాయి వరకే రాణిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీలు టర్ఫ్ మైదానంలో కొనసాగుతాయి. ఇక్కడ మైదానంలో ప్రాక్టీస్ చేసిన క్రీడాకారులు పోటీల్లో జరిగే టర్ఫ్ మైదానంలో రాణించలేకపోతున్నారు. ఒడిశా వంటి రాష్ట్రాల్లో క్రీడాకారులకు టర్ఫ్ మైదానంలో ప్రాక్టీస్ ఉండటంతో ఉన్నతంగా రాణిస్తున్నారు. వనపర్తిలో కూడా టర్ఫ్ మైదానం ఏర్పాటు చేస్తే క్రీడాకారుల క్రీడా నైపుణ్యానికి దోహదపడుతుంది.

దుర్వాసనతో ప్రాక్టీస్ చేయలేకపోతున్నాం..



అకాడమీ పక్కన కూరగాయల విక్రయాల వద్ద కుల్లిన వ్యర్థ పదార్థాలు అక్కడే వదిలేస్తున్నారు. దానికి తోడు మా కోసం కేటాయించిన మూత్రశాలలను కూరగాయల కోసం వచ్చే వారు వినియోగిస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తుంది. ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు సంచరిస్తున్నారు. ప్రాక్టీస్ చేసుకునేందుకు ఇబ్బందిగా ఉంది. క్రీడల్లో మరింత రాణించేందుకు రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాం. క్రీడా సామగ్రి ప్రభుత్వం అందిస్తే మరింత బాగుంటుంది.

– ఆదిత్య సాగర్, సీనియర్ హాకీ క్రీడాకారుడు, వనపర్తి

కూరగాయల విక్రయాలతో ఇబ్బందులు..



హాకీ అకాడమీ పక్కనే కూరగాయలు విక్రయిస్తున్నారు. ప్రహరీ గోడ లేకపోవడంతో కూరగాయల కోసం వచ్చే వారు వాహనాలను లోపలికి తీసుకొస్తున్నారు. విక్రయాల అనంతరం చెత్తా చెదారం అక్కడే వదిలేసి వెళ్తున్నారు. ఇక్కడ విక్రయించకుండా చూడాలని వనపర్తి మున్సిపల్ కమిషనర్‌ను పలుమార్లు కోరారు. అకాడమీ భవనానికి ప్రహరీ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. క్రీడాకారులకు అన్ని రకాల వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్‌ఏ రహమాన్, జిల్లా క్రీడాధికారి, వనపర్తి

సమస్యలు ఇలా..

హాకీ అకాడమీకి సొంతభవనం కొరవడింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన గదులను ఆధునీకరించి అందులోనే హాకీ అకాడమీని ఏర్పాటు చేశారు. సరిపడా గదులు లేక క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాకీ క్రీడాకారులకు సమకూర్చాల్సిన క్రీడా సామగ్రి, దుస్తులను అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఉన్న వాటితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొందని సాధన చేస్తున్న క్రీడాకారులు వాపోతున్నారు. క్రీడాకారులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక ఏజెన్సీని నియమించాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో అకాడమీ క్రీడాకారులకు నాణ్యమైన భోజనం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అకాడమీ భవనానికి కనీస ప్రహరీ కూడా నిర్మించకపోవడంతో పశువులు, కుక్కలు, పందులు ఆవరణలోకి వస్తూ.. అక్కడే సంచరిస్తున్నాయి. మరోవైపు అకాడమి భవనానికి ఆనుకుని తాత్కాలిక కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నారు. అందులో క్రయ విక్రయదారులతో పాటు కుళ్లిన కూరగాయల నుంచి వచ్చే దుర్వాసతో తీవ్ర అసౌకర్యం కలుగుతుందని విద్యార్థులు వాపోతున్నారు. అకాడమీ క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన మూత్రశాలలను మార్కెట్‌కు వచ్చే వారు వినియోగించడంతో దుర్వాసనతో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


అకాడమీ పక్కనే కూరగాయల విక్రయాలు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం


హరీష్‌కుమార్‌గౌడ్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: ముందు వెళ్తున్న జీపును వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీకి చెందిన హరీష్‌కుమార్‌గౌడ్(37), సాయికుమార్‌గౌడ్ కలిసి ఆదివారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్లకు జీపులో వెళ్తుంటే మార్గమధ్యలో జేజేఆర్ గార్డెన్ వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఓవర్‌టేక్ చేసే క్రమంలో వేగంగా జీపును కొట్టింది. జీపులో ఉన్న హరీష్‌కుమార్‌గౌడ్‌కు కుడిపక్క మెడ భాగంలో బలమైన రక్తగాయాలు, పక్కటెముకలకు గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. గాయపడిన సాయికుమార్‌గౌడ్‌ను ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు మధుసూదన్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..


దానయ్య (ఫైల్)

పెబ్బేరు రూరల్: రోడు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శ్రీరంగాపురం మండలంలోని కంబళాపురం వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కంబళాపురం చెందిన గడిముడి దానయ్య (30) పెబ్బేరు నుంచి గ్రామానికి వస్తుండగా కంబళాపురం వాగు బ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పి కింద పడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని..


జగన్నాథ్‌రెడ్డి (ఫైల్)

గండేడ్: ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే మండలంలోని జక్లపల్లికి చెందిన చెంచు గోపాల్ మరో వ్యక్తితో కలిసి ఆదివారం మహబూబ్‌నగర్ నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో మండల కేంద్రానికి రాగానే శ్రీనివాస ఫర్టిలైజర్ షాపు వద్ద నిల్చున్న బల్సూర్‌గొండ చెందిన జగన్నాథ్‌రెడ్డిని ఢీకొట్టారు. దీంతో గోపాల్ తలకు తీవ్ర గాయాలవ్వడంతో పాటు జగన్నాథ్‌రెడ్డికి కాలు, చేయ్యి విరిగింది. వీరిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, జగన్నాథరెడ్డి పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గోపాల్ పరిస్థితి విషమంగా ఉంది.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, కారు ఢీకొట్టుకున్నాయి. కల్వకుర్తికి చెందిన ఇస్లావత్ లస్కర్ కారులో హైదరాబాదులోని శుభకార్యానికి వెళ్తుండగా కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొంది. దీంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ సయ్యద్ రషీద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

దామరగిద్ద: మనస్తాపంతో బావిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండల కేంద్రానికి చెందిన కుడుముల దేవమ్మ(52) తరుచూ తన ముగ్గురు కూతుర్ల వద్దకు వెళ్లి వస్తుండేది. నెల రోజుల క్రితం మోనపురంలోని తన రెండో కూతురు దగ్గర ఉండి శనివారం మండల కేంద్రానికి చేరుకుంది. పెద్ద కొడుకు పని నిమిత్తం మొగుల్‌మడ్క వెళ్లగా, ఇంటికి రాగా తన తల్లి లేకపోవడంతో అక్కను అడిగాడు. దామరగిద్దకు వెళ్తున్నానని చెప్పి వచ్చిందని తమ్ముడి దగ్గరే ఉండమని చెప్పిందన్నారు. తీరా ఆదివారం బావిలో శవమై కనిపించడంతో పెద్ద కుమారుడు నగేష్ గుర్తించాడు. మృతురాలికి ముగ్గురు కూతుర్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..

కోస్గి: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నాగుసాన్‌పల్లికి చెందిన రవి(28) ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. తాగుడుకు బానిసై తరుచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలున్నారు.

కల్లు మానాలని చెప్పినందుకు..

జడ్చర్ల: భార్యను కల్లు తాగడం మానుకోవాలని భర్త చెప్పడంతో విషం తాగి ఆత్మహత్య చేసుకుందని సీఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. వీపనగండ్ల మండలం సంగినేనిపల్లి చెందిన భార్యాభర్తలు మీసాల పుష్ప, వెంకటయ్య ఉపాధి నిమిత్తం పట్టణానికి వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పుష్ప(38) విషం తాగింది. చికిత్స కోసం బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో, జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతురాలి తండ్రి శేషన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో సొప్పలారీ దగ్ధం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


కాలిపోయిన వరిగడ్డి

పెంట్లవెల్లి: మండలంలోని యంగంపల్లితండా, చెన్నంపల్లి శివారులో ఆదివారం సొప్ప లారీ పొలం దాటుతుండగా విద్యుదాఘాతంతో దగ్ధమైంది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వెంటనే అక్కడకి అగ్నిమాపక ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు సిబ్బందితో వచ్చి మంటలు అదుపు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలానికి చెందిన కృష్ణయ్య సొప్ప వ్యాపారం నిర్వహిస్తుంటాటు. ఎప్పటి లాగే అతను 4 లారీల్లో సొప్పను తీసుకెళ్తుండగా అందులో ఒకటి వ్యవసాయ పొలం దాటిస్తుండగా కరెంటు తీగలు తగిలి మంటలు అంటుకున్నాయి. సొప్పతో పాటు లారీ కూడా కాలిపోయింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.5లక్షలపైగానే నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

పశుగ్రాసం దగ్ధం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వేములలో ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని శ్మశానవాటికలో ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతోనే పక్కనే ఉన్న కళ్లందొడ్లలోకి వ్యాపించింది. ఈ క్రమంలో కళ్లందొడ్లతో పాటు అందులో ఉన్న 3ట్రాక్టర్ల వరి గడ్డి పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటస్వామి సంఘటనా స్థలానికి చేరుకొని ఫైర్‌ఇంజన్ సాయంతో మంటలను అదుపు చేశారు. సుమారు రూ.45వేల వరకు ఆస్తినష్టం అయినట్లు బాధితులు రాజేష్, రాజారత్నం, రాములు వాపోయారు.

ద్విచక్రవాహనానికి నిప్పు



ఊట్కూరు: మండల కేంద్రంలోని సర్దార్‌నగర్ వీధికి చెందిన అంబాదాస్ ద్విచక్ర వాహనానికి ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ అబ్జల్ తెలిపారు. వీధిలో తన ఇంటి ముందు ద్విచక్ర వాహనం నిలిపి ఉంచగా, తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా ఇరుగుపొరుగు వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. అప్పటికే పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూడు ఇళ్లలో చోరీ

- బంగారు, వెండి, నగదు అపహరణ

ఉప్పునుంతల: మండలంలోని తాడూరులో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పక్కపక్కనే ఉన్న మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి గ్రామానికి చెందిన బూరం రమేష్‌కు ఇంటి తాళాలను విరుగొట్టిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 57 తులాల వెండి వస్తువులు, 17.5 గ్రాముల బంగారు వస్తువులు, కొంత నగదును దోచుకెళ్లారు. ఆ సమయంలో రమేష్ కుటుంబ సభ్యులు బంధువుల గ్రామానికి వెళ్లారు. అదేవిధంగా గుండెమోని జంగమ్మ ఇంట్లో 45 తులాల వెండి వస్తువులు, పావు తులం బంగారు పుస్తె, కొంత నగదును, గుండెమోని పర్వతాలు ఇంట్లో 20 తులాల వెండి వస్తువులు, నగదును దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

బంగారు ఆభరణాలు చోరీ

గద్వాల క్రైం: ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్‌షుకూర్ కథనం మేరకు.. పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన కృష్ణమూర్తి వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యల విషయంలో కర్నూల్ జిల్లాలోని ఆస్పత్రికి శనివారం రాత్రి వెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం తీసి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలోని రూ. 95వేల విలువ గల బంగారు ఆభరణాలు అపహరించినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ: కేసు నమోదు

ధరూరు: మండల కేంద్రంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడగా వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ కర్నె శేఖర్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ వర్గానికి చెందిన కుర్వ రాధాకృష్ణ, మరో వర్గానికి చెందిన తెలుగు రామకృష్ణ, సత్యన్న వ్యక్తిగత సమస్యపై ఆదివారం మధ్యాహ్నం గొడవ పడ్డారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాట ఆడుతున్న వారిపై..

వెల్దండ: మండల కేంద్రంలోని గ్యాస్ గోదామ్ సమీపంలో తుర్కకుంట వద్ద ఆదివారం సాయంత్రం యువకులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ శ్రీనివాస్ సిబ్బందితో దాడి చేశారు. మండల కేంద్రానికి చెందిన శ్రీశైలం, శ్రీను, వెంకటయ్య, కృష్ణ, మనోహర్, మల్లేష్, శ్రీశైలం, మల్లేష్, శేఖర్, మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 8బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.11,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వానరానికి అంత్యక్రియలు

కృష్ణా: ఎండవేడిమికి తట్టుకోలేక ఓ వానరం (కొణంగి) మృతిచెందగా.. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలిలా.. నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోని ముడుమాల్‌లో ఆదివారం ఎండవేడిమి తట్టుకోలేక వానరం మృతిచెందింది. గమనించిన గ్రామస్తులు వానరాన్ని ఆంజనేయస్వామిగా భావించి.. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలతో భజనలు చేస్తూ గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి మనుషులకు చేసినట్టుగానే అంత్యక్రియలు జరిపించారు. గ్రామ పెద్దల సూచన మేరకు చందాలు వేసుకుని వానరానికి అంత్యక్రియలు చేశామని గ్రామ యువకులు చెప్పారు.


ముడుమాల్‌లో వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

పులిగుట్ట వద్ద ఉద్రిక్తత

- మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన
- పొక్లెయిన్, టిప్పర్ల అద్దాలు ధ్వంసం,
- షెడ్డుకు నిప్పుపెట్టిన గ్రామస్తులు


అమడబాకుల పులిగుట్ట వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కొత్తకోట: పులిగుట్ట మైనింగ్‌పై చాలా రోజులుగా మండలంలోని అమడబాకుల గ్రామస్తులు పోరాడుతున్నారు. మైనింగ్ పనులు ఆపేయాలని ధర్నాలు, నిరసనలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం వందలాది మంది పులిగుట్ట వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. గుత్తేదారులు పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో కాంట్రాక్టర్ రావడంతో అతన్ని అడ్డుకున్నారు. కాంట్రాక్టర్‌కు సంబంధించిన టిప్పర్, పొక్లెయిన్ అద్దాలను ధ్వంసం చేశారు. పక్కనే ఉన్న షెడ్డుకు నిప్పుపెట్టారు. కంటైనర్‌ను ఎత్తి పారేశారు. పులిగుట్టపై మైనింగ్ పనులు చేపట్టడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

కలెక్టర్ రావాలంటూ ధర్నా..

కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ రావాలంటూ 5 గంటల పాటు ఆందోళన చేపట్టారు. మైనింగ్‌కు సంబంధించిన అనుమతులు 20 ఏళ్ల కిందట ఇచ్చారని, ఇప్పుడు పరిస్థితులు వేరుగా ఉన్నాయన్నారు. ఈ 20 ఏళ్లలో ఏనుగుంట రిజర్వాయర్, ప్రభుత్వ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలను నిర్మించారని, 33కేవీ సబ్ స్టేషన్ కూడా ఈ పులిగుట్ట సమీపంలోనే ఉందని, మైనింగ్ కోసం పులిగుట్టపై బ్లాస్టింగ్ చేస్తే వాటి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇవన్ని పరిగణలోకి తీసుకొని మైనింగ్ లీజును రద్దు చేయాలని గతంలోనే కలెక్టర్‌ను కోరినట్లు గ్రామస్తులు వెల్లడించారు. కొందరు రాజకీయ నాయకులు గుంటనక్కల్లా వ్యవహరిస్తూ, కాంట్రాక్టర్‌కు కొమ్ముకాస్తున్నట్లు ఆరోపించారు.

- సంఘటన స్థలానికి తహసీల్దార్ బాల్‌రెడ్డి, ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి చేరుకొని గ్రామస్తులను శాంతింపచేసేందుకు ప్రయత్నించారు. పనులు నిలిపివేస్తేనే ఆందోళన విరమిస్తామని తెగేసి చెప్పడంతో అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి తవ్వకాలకు సంబంధించిన మిషన్లను అక్కడి నుంచి పంపించారు. దీంతో గ్రామస్తులు శాంతించారు. ధర్నాకు బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ మద్దతు ఇచ్చారు. ధర్నాలో సర్పంచ్ బుచ్చన్న, నాయకులు అంజన్నయాదవ్, బాలమణెమ్మ, భరత్‌భూషన్, నరేందర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, రాములు యాదవ్, సురేంద్రచారి, ప్రకాష్‌శెట్టి, చంద్రశేఖర్‌చారి, నగేష్, అశోక్, నాగరాజుగౌడ్ గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


కంటైనర్‌ను తోసివేస్తున్న గ్రామస్తులు


కాలిపోతున్న షెడ్డు

సాక్షి క్లాసిఫైడ్స్

ADMISSIONS FOR GUIDENCE
Admissions for Guidence B.Tech/M.Tech/ M.B.A, LLB / B.Sc, M.Sc Agri, P.G (All), Ph.d Few Seats Available. Cont: 9391471754, 8985533447, Hyd.

SERVICES

BUSINESS OFFER
Wanted Franchise / Agents in Hyderabad & All Telangana & All Andhra Pradesh. New Maruthi Couriers and Cargo Services Call: 9010459283

WANTED
HYDలో ప్రముఖ E-కామర్స్, ఫార్మా, MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్ వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కేటరింగ్ బాయ్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీతం: 15,000-30,000. ఫోన్: 9347487286

సాక్షి భవిత విద్యార్థుల కోసం



గమనిక

క్లుప్తంగా...



ప్రధాని మోదీతో ఏపీ గవర్నర్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ భేటీ అయ్యారు. గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఢిల్లీ పర్యటనకు వచ్చిన జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆదివారం ప్రధాని, కేంద్ర హోం మంత్రి, మాజీ రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారంతా జస్టిస్ నజీర్‌కు అభినందనలు తెలిపారు.

నాటుపడవ బోల్తా
ఆరుగురు గల్లంతు..

పొదలకూరు: సరదాగా చెరువులో విహరించాలన్న యువకుల సంతోషం విషాదంగా మారింది. ఒక గ్రామానికి చెందిన పది మంది యువకులు నాటు పడవలో చెరువులో షికారుకెళ్లి ప్రమాదంలో చిక్కుకున్నారు. వీరిలో నలుగురు సురక్షితంగా బయటపడగా, ఆరుగురు గల్లంతయ్యారు. ఈ ఘోర దుర్ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తోడేరు కొత్త చెరువులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. విషయం తెలుసుకుని గ్రామస్తులందరూ చెరువు వద్దకు చేరుకున్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం తోడేరుకు చెందిన పముజుల బాలాజీ (20), బట్ట రఘు (20), అట్లా శ్రీనాథ్ (16), మన్నూరు కళ్యాణ్ (30), చల్లా ప్రశాంత్‌కుమార్ (16), పాడి సురేంద్ర (16), ఏనుగు విష్ణు (18), ఎ. కిరణ్ (18), ఒంటేరు మహేంద్ర (20), ఒంటేరు మహేష్ (19) సా.5.30 గంటల ప్రాంతంలో చెరువులో నాటు పడవలో షికారుకెళ్లారు. చెరువు మధ్యలోకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏనుగు విష్ణు, ఒంటేరు మహేంద్ర, ఒంటేరు మహేష్, ఎ. కిరణ్ ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. మిగిలిన ఆరుగురు యువకులు గల్లంతయ్యారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఈ సమాచారం తెలుసుకున్న పొదలకూరు సీఐ జీ సంగమేశ్వరరావు, ఎస్సై ఎస్‌కే కరీముల్లా గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టినా గల్లంతైన యువకుల ఆచూకీ దొరకలేదు.

ఏసీపీ నేతృత్వంలో నవీన్ హత్యకేసు దర్యాప్తు

- హరిహరకృష్ణతోపాటు స్నేహితులను ప్రశ్నించేందుకు సిద్ధమైన పోలీసులు
- నిందితుడి కస్టడీ కోసం నేడు కోర్టులో పిటిషన్ వేసేందుకు ఏర్పాట్లు


హరిహరకృష్ణ


నవీన్(ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఇంజనీరింగ్ విద్యార్థి నవీన్ హత్యకేసులో దర్యాప్తు అధికారిగా వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఆయన నేతృత్వంలో పలు పోలీసు బృందాలు లోతుగా దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలను రాబట్టే పనిలో నిమగ్నమయ్యాయి. ఘటన జరిగిన ప్రదేశానికి కొద్దిదూరంలోనే విజయవాడ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఉన్నాయని.. వాటిని పరిశీలిస్తే నవీన్, హరిహరకృష్ణతోపాటు ఇంకా ఎంతమంది అక్కడికి వచ్చారనేది తేలనున్నట్టు పోలీసులు చెప్తున్నారు. ఇక నవీన్‌ను హత్య చేసిన ప్రాంతానికి దగ్గరగా ఉన్న అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట, బాటసింగారం ప్రాంతాలపై హరిహరకృష్ణకు ముందే స్పష్టమైన అవగాహన ఉన్నట్టు భావిస్తున్నారు. శివారు ప్రాంతాలు కావడం, పదుల సంఖ్యలో ఇంజనీరింగ్ కాలేజీలు ఉండటంతో.. నిర్మానుష్య ప్రాంతాలను ఎన్నుకుని గుట్టుచప్పుడు కాకుండా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం. నవీన్, హరిహరకృష్ణ, వారి స్నేహితులు గతంలో గంజాయికోసం ఈ ప్రాంతాలకు వచ్చి ఉంటారని, ఈ క్రమంలోనే హత్యకు నిర్మానుష్య ప్రాంతాన్ని సులువుగా ఎంచుకుని ఉంటాడని భావిస్తున్నారు.

నిందితుడి కస్టడీ కోసం నేడు పిటిషన్

ఈ కేసులో నిందితుడు హరిహరకృష్ణను విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఈ హత్యకు సంబంధించి హరిహరకృష్ణ, నవీన్ స్నేహితులను కూడా విచారించనున్నట్టు సమాచారం. నవీన్‌ను హత్య చేసిన హరిహరకృష్ణ.. ఆ తర్వాత నవీన్ స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడిన ఆడియో రికార్డులు బయటికి వచ్చాయి. హరిహరకృష్ణ హత్యకు పాల్పడిన ఆందోళన, భయం వంటివేమీ లేకుండా మాట్లాడిన తీరు విస్మయానికి గురిచేస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిందితుడి అన్నకూ నేర చరిత్రే..

ఖిలా వరంగల్: స్నేహితుడిని దారుణంగా హత్య చేసిన హరిహరకృష్ణ స్వస్థలం వరంగల్‌లోని కరీమాబాద్ ప్రాంతం. తండ్రి స్థానికంగా ఆర్‌ఎంపీ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. హరిహరకృష్ణ అన్న ముఖేశ్ గతంలో ఓ హత్యానేరంలో జైలుకు వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు హరిహరకృష్ణ తాను ప్రేమించిన యువతి కోసం స్నేహితుడిని దారుణంగా హత్యచేయడం కరీమాబాద్ ప్రాంతంలో కలకలం రేపింది.

నవీన్ తల్లిదండ్రులు మమ్మల్ని క్షమించాలి

ఇద్దరు ప్రాణ స్నేహితులు ఒకే అమ్మాయిని ప్రేమించడం దురదృష్టకరమని.. అయినా తప్పు చేసినవారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని నిందితుడు హరిహరకృష్ణ తండ్రి పేరాల ప్రభాకర్ పేర్కొన్నారు. తన కొడుకును ఉన్నతంగా చూడాలని అనుకున్నానని, కానీ ఇలా అవుతుందని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన కొడుకును తానే స్వయంగా పోలీసులకు అప్పగించానని వివరించారు. నవీన్ తల్లిదండ్రులకు తీరని లోటు జరిగిందని.. వారు తన కుటుంబాన్ని పెద్ద మనసుతో క్షమించాలని విజ్ఞప్తి చేశారు.



విశాఖ శ్రీ శారదాపీఠం పర్యవేక్షణలో హరియాణాలోని కురుక్షేత్రలో 16 రోజులపాటు జరిగిన లక్ష చండీ మహా యజ్ఞం ఆదివారం మహా పూర్ణాహుతితో ముగిసింది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ..ఈ భూమండలంపై లక్ష చండీ మహా యజ్ఞం జరిగిన తొలి ప్రాంతంగా కురుక్షేత్రలోని గుంతీ గ్రామం చరిత్రలో నిలుస్తుందని తెలిపారు. లోక కల్యాణార్థం ఇలాంటి కార్యక్రమాలు రాజుల కాలంలో చేపట్టినట్లు చరిత్ర ద్వారా తెలుసుకున్నామని, ఇప్పుడు కళ్లారా చూశామని తెలిపారు. భారతావనికి కచ్చితంగా శుభ దినం కాగలదని ఆకాంక్షించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర మాట్లాడుతూ ఇది మహత్తర యజ్ఞమని అభివర్ణించారు. –సింహాచలం



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, కల్పనా దాస్ దంపతులు ఆదివారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉగాది తర్వాత గొర్రెల పంపిణీ

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో మంత్రి హరీశ్‌రావు


మంత్రి హరీశ్‌రావుకు గొంగడి కప్పిన కురుమలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రెండో విడత గొర్రెల పంపిణీ ఉగాది, శ్రీరామనవమి పండగల తర్వాత చేపడతామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖమంత్రి టి.హరీశ్‌రావు ప్రకటించారు. గొర్రెల ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ పథకం యూనిట్ వ్యయాన్ని కూడా పెంచుతామన్నారు. ఆదివారం సంగారెడ్డిలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం, కురుమ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ రూ.300 కోట్లతో హైదరాబాద్‌లో గొల్ల, కురుమల ఆత్మగౌరవ భవనం నిర్మిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వం గొల్ల, కురుమలను వాడుకుందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.2 వేల కోట్లతో సరిపెట్టి, బీసీలకు అన్యాయం చేస్తోందని హరీశ్ విమర్శించారు. కురుమ సామాజిక వర్గంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరిగేవని, కల్యాణలక్ష్మి పథకం అమలు చేసిన తర్వాత ఈ బాల్యవివాహాలు బంద్ అయ్యాయన్నారు. రాష్ట్రంలో గొల్ల, కురమలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కర్ణాటక మాజీ మంత్రి రేవన్న సీఎం కేసీఆర్‌ను కలిసి గొంగడి కప్పి అభినందించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఈ విషయంలో రేవన్నకు ఏఐసీసీ నోటీసులు కూడా జారీ చేసిందన్నారు. సభలో ఎంపీలు బీబీపాటిల్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, మాణిక్‌రావు, హెచ్‌డీసీ రాష్ట్ర చైర్మన్ చింతప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, గొల్ల కుర్మ సంఘం నేతలు నగేశ్, శ్రీహరి, పాండు తదితరులు పాల్గొన్నారు.

తొలి గంటలో బిడ్డకు ముర్రుపాలు

సాక్షి, హైదరాబాద్: పుట్టిన తొలి గంటలో తల్లి నుంచి బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ, మాతా శిశు సంరక్షణ కేంద్రాలలో గర్భిణులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 'బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్‌నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల్లో సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఇందుకోసం మాతా శిశు సంరక్షణ కేంద్రాల్లో లాక్టేషన్‌వర్కర్లను నియమించనున్నారు. దీంతోపాటు మాతా శిశు సంరక్షణ యూనిట్లలో తల్లిపాలకేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని ఆస్పత్రుల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వస్తున్నట్లు వైద్య వర్గాలు చెప్పాయి. తొలిగంటలోనే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల అనేకరకాల జబ్బుల నుంచి రక్షణ ఏర్పడుతుంది. ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే తాగిస్తే..ఐదేళ్లలోపు పిల్లల మరణాలను 22% నివారించవచ్చని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువ శాతం సిజేరియన్ ద్వారానే బిడ్డను బయటకు తీయడం వల్ల వారు తొలి గంటలో ముర్రుపాలకు దూరమవుతున్నారు. ఆ సమయంలో బిడ్డకు తల్లి పాలిచ్చే పరిస్థితి ఉండటంలేదు. ఈ పరిస్థితిని నివారించేందుకే బ్రెస్ట్ ఫీడింగ్‌పై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

గుంటూరులో..



టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టకపోయినా, కొట్టారని పాత ఫొటోలతో ప్రజలను మోసం చేసిన ఈనాడు దిగజారుడు పాత్రికేయ విలువలకు వ్యతిరేకంగా గత మూడు రోజులుగా ఏపీ వ్యాప్తంగా ప్రజల ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. ఆదివారం కూడా ప్రజలు, వివిధ సంఘాల నేతలు, పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనాడు తీరును నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.

అలంపూర్ ఆలయాల్లో ప్రముఖుల పూజలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను ఏపీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఐఏఎస్ అధికారి చిన్నరాముడు, సహకార విద్యుత్ సరఫరా సంఘం సెజ్ చైర్మన్ రామారావు, ఉస్మానియ యూనివర్సిటీ డిగ్రీ కళాశాలల విద్యార్థి విభాగం చైర్మన్ ప్రకాష్ తదితరులు దర్శించుకున్నారు. వీరితోపాటు స్థానిక మున్సిపల్ చైర్మన్ మనోరమ, ఉపాధ్యాయులు వెంకటేష్, రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకట్రామయ్య శెట్టి, సహకార సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఉన్నారు.

సోమశిల, అమరగిరిలో ముంబై ఎక్స్‌పర్ట్ టీం



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల, అమరగిరి ఏరియాలను ఫారెస్టు ముంబై ఎక్స్‌ఫర్ట్ టీం సందర్శించి అక్కడ నెలకొల్పే ఈసీఓ అభివృద్ధి పార్కుల స్థలాలను పరిశీలించారు. వారు సోమశిల వద్ద కృష్ణానది బ్యాక్ వాటర్ స్థలాన్ని చూశారు. అదే విధంగా అమరగిరి సమీపంలో ఉన్న అటవి స్థలాలను స్థానిక ఫారెస్ట్ అధికారులతో కలిసి చూశారు. కార్యక్రమంలో రేంజర్ శరత్ చంద్రారెడ్డి, అమరగిరి, సోమశిల ఫారెస్టు బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

గద్వాల క్రైం: బంగారు గొలుసు చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ అబ్దుల్‌షుకూర్ తెలిపారు. 2020లో పట్టణంలో ముస్లిం అనే యువకుడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్నాడు. ఇరానీ గ్యాంగ్‌కు చెందిన ఈయన పక్కా సమాచారం మేరకు గుంతకల్‌లో పట్టుకున్నారు. ఆదివారం అరెస్టు చేసి గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వచ్చేది బహుజన రాజ్యమే..


రాజ్యాధికార యాత్ర సభలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- నన్ను ప్రశ్నించే ముందు మీరేం చేశారో చెప్పండి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- అలంపూర్‌లో బహుజన రాజ్యాధికార పాదయాత్ర ప్రారంభం

జోగుళాంబ శక్తిపీఠం/ అలంపూర్ రూరల్: రాష్ట్రంలో వచ్చేది బహుజన రాజ్యమే అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం అలంపూర్ నియోజకవర్గం నుంచి బహుజన రాజ్య యాత్ర సమావేశం సాయంత్రం ప్రారంభమైంది. అంతకు ముందు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ప్రజలు పూల వర్షం కురిపిస్తూ బ్రహ్మరథం పట్టారు. ముందుగా వారు మహనీయుల విగ్రహాలకు పూలమాల వేసి జోగుళాంబ ఆలయాన్ని దర్శించుకున్నారు. అక్కడ దేవస్థానం వారు వారికి ఘన స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు, సమీపంలోని షాఅలీ పహిల్వాన్ దర్గాలో ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. నేనేం చేశానంటూ ప్రశ్నించేవారు ముందుగా వారేం చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ ప్రాంతం, రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్నానని పేర్కొన్నారు. ఉస్మానియ యూనివర్సిటీలో ఆంధ్ర పోలీసుల బారి నుంచి తెలంగాణ విద్యార్థులను కాపాడుకున్నామన్నారు. తొమ్మిదేళ్లలో రాష్ట్ర సొమ్మును ఆంధ్ర కాంట్రాక్టర్లకు ముట్టజెప్పారని విమర్శించారు. అలంపూర్ ప్రాంతానికి ఈ ప్రభుత్వాలు చేసిందేమి లేదన్నారు. సిద్దిపేట జిల్లాలో ఎన్ని ఆస్పత్రులు, కళాశాలు ఉన్నాయి.. ఇక్కడ ఎన్ని ఉన్నాయో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. తాను ఎవరిపై విమర్శలు చేయడం లేదని, తన సొంత ప్రాంతానికి చేస్తున్న అన్యాయంపై మాత్రమే ప్రశ్నిస్తున్నానన్నారు. ప్రభుత్వం తనపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఎన్నికల్లో మాత్రం ప్రజలు బీఎస్పీకి పట్టం కడతారన్నారు.

పదవిని త్యాగం చేశారు..

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ అలంపూర్‌ను ఆర్‌టీడీ స్థాయికి తీసుకెళ్లిన ఘనత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌దే అన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు శీలం అనితారెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బహుజనుల కోసం తన పదవిని త్యాగం చేశారని, వారి త్యాగం వృథా కానివ్వరాదని, రాష్ట్రంలో 65 స్థానాల్లో విజయం సాధిస్తే పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్ర ముస్లిం మైనార్టీ కన్వీనర్ మౌలానా షఫీ మసూద్, అధికార ప్రతినిధి సాంబశివగౌడ్, దాసరి ఉష మాట్లాడుతూ గురుకుల పాఠశాల పని చేసిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్రంలోని విద్యార్థులకు బంగారు భవిష్యత్ కల్పించారని, అలాంటి వారిని అధికారంలోకి తీసుకొస్తే రాష్ట్ర పురోగతికి బంగారు బాట వేసినట్టు అవుతుందన్నారు. రాష్ట్రంలో ఆకలి చావులు, నిరుద్యోగుల పరిస్థితులను వారి ప్రసంగాలలో వివరిస్తూ ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే శక్తి ఆర్‌ఎస్‌పీకి మాత్రమే ఉందన్నారు.

అలరించిన ఆటపాటలు

గజ్జల అశోక్, పాటమ్మ రాంబాబు తమ ఆటపాటలతో ప్రాంత సమస్యలను, వాటి పరిష్కారాలను చూపిస్తూ ప్రజల్లో ఉత్సాహం నింపారు. అదేవిధంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అందించిన సహకారంతో తాము అత్యున్నత స్థాయిలో నిలవగలిగామంటూ కొంతమంది విద్యార్థులు వేదిక పైకి వచ్చి వారి ప్రసంగాల ద్వారా తెలియజేశారు.


హాజరైన నాయకులు, ప్రజలు

గ్రామంలో చిచ్చుపెట్టిన ఇథనాల్ కంపెనీ


ఆందోళనకారులను శాంతింపజేస్తున్న పోలీసులు

మరికల్: మండలంలోని చిత్తనూరులో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని ఏడాది నుంచి ఆందోళన చేస్తున్న వారిని కొందరు వ్యతిరేకంగా మాట్లాడడంపై ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం రాత్రి ఆందోళన కారులు ఉద్యమానికి సహకరించడం లేదని ప్రజాప్రతినిధుల శవయాత్ర నిర్వహించారు. దీంతో వారి అనుచరులు కోపోద్రిక్తులై ఆందోళనకారుల ఇళ్లకు సంబంధించిన నీటి పైపులను ధ్వంసం చేశారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్లపై దాడి చేశారు. దీంతో వారిపై మహిళలు ఎదురుతిరిగి వాగ్వివాదానికి దిగారు. ఇరువురి మధ్య తోపులాట జరిగింది. విషయంపై చిత్తనూర్‌లో గ్రామస్తులు వారిని కఠినంగా శిక్షించాలని ఆందోళనకు దిగారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐ అశోక్‌బాబు గ్రామానికి వెళ్లి ఇరు వర్గాలను శాంతింపజేశారు. రాత్రి 12 గంటల వరకు గ్రామంలో పోలీసుల నిఘా ఉంచుతామని సీఐ తెలిపారు.

ముదిరాజ్‌ల రాజ్యాధికారమే లక్ష్యం

- ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌బాబు


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ బాబు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జనాభాలో సగభాగం ఉన్న ముదిరాజ్‌లు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదుగాలని ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ బాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైత్రి యాదయ్య అధ్యక్షతన ఆదివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ముదిరాజ్ సేవా సమితి పాండవకుల సామ్రాజ్య నిర్మాణమే లక్ష్యం పేరుతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు ఎమ్మెల్యే స్థానాలను ముదిరాజ్‌లకు రిజర్వేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. అందుకు మిగతా 12 స్థానాల్లో ముదిరాజుల సంఖ్యా బలం ఇతరులకు మద్దతు తెలుపుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 25 స్థానాల వరకు గెలుచుకునే సత్తా ముదిరాజులకున్నదని, ఏ పార్టీ నుంచి టికెట్ వచ్చిన ముదిరాజులను గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైత్రి యాదయ్య మాట్లాడుతూ ఈ సమావేశం కాకుండా అధికార పార్టీ నాయకులు, మంత్రి అడ్డుకట్టలు వేశారని, ముదిరాజ్ నాయకులను భయభ్రాంతులకు గురి చేశారని మండిపడ్డారు. మాజీ మంత్రి పొడపాటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏ పార్టీ నుంచి ముదిరాజ్ నిలబడిన అందరూ ఒక్కటై గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రఘువర్మ, మురళి, చంద్రమోహన్, శివాని, ఆంజనేయులు, అశన్న తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల బండిపై ఊరేగిన నూతన దంపతులు



ఎద్దుల బండిపై ఊరేగి పూర్వ సంప్రదాయాన్ని గుర్తు చేశారు ఓ నూతన జంట. మండలంలోని ఎద్దుమిట్టతండాకు చెందిన లావణ్య, వెంకటేష్‌ల వివాహం ఆదివారం జరిగింది. అనంతరం ఆ జంట వినూత్నంగా ఎద్దుల బండిపై ఊరేగారు. ప్రస్తుత 5జీ కాలంలో విలువైన కార్లు, ఇతర వాహనాల్లో ఊరేగడం పరిపాటి. కానీ ఈ జంట పాతతరం జ్ఞాపకాలను గుర్తు చేస్తూ ఎద్దుల బండిపై ఊరేగడం ఆశ్చర్యానికి లోను చేసింది. ఈ సంఘటన చూసిన తండా వాసులంతా జంటను అభినందించారు. –అచ్చంపేట రూరల్

నల్లమలకు 19 చుక్కల దుప్పులు



అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లి నల్లమల అటవి ప్రాంతంలో ఆదివారం అటవీశాఖ అధికారులు 19 చుక్కల దుప్పులను విడుదల చేశారు. హైదరాబాద్ నెహ్రూ జూపార్క్ నుంచి ఏడు మగ, 12 ఆడ చుక్కల దుప్పులను తీసుకొచ్చారు. అటవిలో శాఖాహార, మాంసాహార జంతువుల సమతుల్యతతో పాటు బఫర్‌జోన్‌లో పెద్ద పులి ఆహారం కోసం శాఖహార జంతువులైన చుక్కల దుప్పులను విడుదల చేసినట్లు ఎఫ్‌ఆర్‌ఓ ప్రభాకర్, ఎఫ్‌బీఓ హన్మంత్‌నాయక్ తెలిపారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని వన్యప్రాణులు, అటవుల సంరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.